ఆట | నమస్తే తెలంగాణ
కరీంనగర్, శనివారం 27 జూలై 2024
www.ntnews.com

విశ్వక్రీడలకు తెరలేచింది. ఇన్నాళ్లుగా ఎదురుచూసిన అద్భుత క్షణం ఆవిష్కృతమైంది. గతానికి భిన్నంగా, చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకలు అంబరాన్నంటాయి. చారిత్రక సీన్ నది ఒడ్డును తమ దేశ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ ఫ్రాన్స్ ప్రారంభ వేడుకలను అదిరిపోయే రీతిలో రూపకల్పన చేసింది. ఒలింపిక్స్‌ను అందరికీ చేరువ చేయలనే రీతిలో స్టేడియానికి పరిమితం కాకుండా నదిని వేదికగా మలుచుకుంటూ క్రీడాభిమానులను కనులవిందు చేసింది. సరిగ్గా శతాబ్దం తర్వాత విశ్వక్రీడలకు ఆతిథ్యమిస్తున్న పారిస్‌ను కలకాలం గుర్తుంచుకునే రీతిలో వేడుకలు అలరించాయి. దిగ్గజ ఫుట్‌బాలర్ జినేదిన్ జిదాన్ చేతబూనిన ఒలింపిక్ టార్చ్ వీడియోతో మొదలై నదిపై ప్లేయర్ల మార్చ్‌ఫాస్ట్‌తో ప్రారంభ కార్యక్రమం అట్టహాసంగా మొదలైంది.






# ‘ఆల్ ద బెస్ట్’

### ఒలింపిక్స్ ప్లేయర్లకు కేటీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత ప్లేయర్లకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆల్ ద బెస్ట్ చెప్పారు. శుక్రవారం మొదలైన విశ్వక్రీడల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న 117 మంది ప్లేయర్లను దేశ ప్రజలంతా ఉత్సాహపర్చలన్నారు. టోక్యో(2020) ఒలింపిక్స్‌లో సాధించిన పతకాల(7) రికార్డును ఈసారి అధిగమించాలని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్లేయర్లందరూ తమ అత్యుత్తమ ప్రదర్శనతో విజయం సాధిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసిన కేటీఆర్ వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రతీ క్రీడాకారుడు అత్యుత్తమ ప్రదర్శనతో దేశానికి కీర్తి, ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న తెలుగు ప్లేయర్లు నిఖత్‌జరీన్, ఇసాసింగ్, పీవీ సింధు, ఆకుల శ్రీజ, జ్యోతి, జ్యోతికశ్రీ, సాత్విక్‌సాయిరాజ్, ధీరజ్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పతకధారులు సింధు, శరత్‌కమల్‌తో పాటు భారత చెఫ్ డీ మిషన్ గగన్ నారంగ్‌ను కేటీఆర్ అభినందించారు.

# ఆహా..అద్భుతం

## పారిస్ ఒలింపిక్స్ గేమ్స్ షురూ

### వినూత్న రీతిలో ఆరంభ వేడుకలు
### మువ్వన్నెల పతాకంతో సింధు, శరత్‌కమల్
### సీన్ నది తీరాన ఒలింపిక్ సందడి
### వరుణుడి ఆటంకం మధ్య కార్యక్రమాలు



పారిస్: సుదీర్ఘ ఒలంపిక్ చరిత్రలో పారిస్ ఒలింపిక్స్‌కు ప్రత్యేక స్థానం దక్కింది. ఎవరూ ఊహించని రీతిలో క్రీడలకు అందరికీ దగ్గరి చేయాలనే తలంపుతో ఆరంభ వేడుకలు వినూత్న రీతిలో అదరగొట్టాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు మొదలైన ఆరంభ వేడుకలు ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరం వేదికగా మొదలయ్యాయి. ఫుట్‌బాలర్ జిదానే ఒలింపిక్ టార్చ్ పట్టుకుని పరిగెత్తగా..అతన్ని అనుసరిస్తూ కొంత మంది చిన్నారులు పడవలో ప్రయాణించడంతో ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెరతీసినట్లు అయ్యింది. ఫ్రాన్స్ ప్రధాని ఎమాన్యుయెల్ మక్రాన్, అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య(ఐవోసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ అతిథులతో పాటు అభిమానులను చేతులు ఊపుతూ మార్చ్‌పాస్ట్‌కు స్వాగతం పలికారు. వివిధ దేశాలకు చెందిన అధ్యక్షులు, ప్రధానులు, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఫ్యాషన్‌కు పెట్టింది పేరు అయిన పారిస్ సంస్కృతిని ప్రతిబింబిస్తూ అంతకుముందు జరిగిన షోలో పలువురు క్రీడా ప్రముఖులు తమదైన శైలిలో దుస్తులు ధరించి ఈఫిల్ టవర్ ముందు ఫొటోలు ఫోజులు ఇచ్చారు.

**గ్రీస్‌తో మొదలై:**

ఒలింపిక్స్‌కు ఆద్యులైన గ్రీస్ దేశంతో ఒలింపిక్స్ మార్చ్‌పాస్ట్ మొదలైంది. ఆరు కిలోమీటర్ల దూరమైన పరేడ్ అస్టేలిట్జ్ బ్రిడ్జ్ నుంచి మొదలైంది. సీన్ నదికి ఇరువైపులా ఉన్న అతిథులు, అభిమానులకు అభివాదం చేస్తూ ఆయా దేశాల ప్లేయర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పడవల్లో ముందుకు సాగారు. తమ దేశ జాతీయ జెండాలను చేతబూని ఈలలు, కేరింతలు, హర్షధ్వానాలతో అలరించారు. గ్రీస్ తర్వాత ఐవోసీ రెఫ్యూజీ టీమ్ వరుస క్రమంలో వచ్చింది. ఫ్రెంచ్ అక్షర క్రమాన్ని అనసరిస్తూ ఆయా దేశాలకు చెందిన అథ్లెట్లు తమకు ఏర్పాటు చేసిన పడవల్లో ప్రయాణించారు. భారత్ తరఫున సింధు, శరత్ కమల్ పతకాధారులుగా వ్యవహరించారు.

**85 బోట్లు, 6800 మంది అథ్లెట్లు:**

సీన్ నదిని ఆధారంగా చేసుకుంటూ ప్రముఖ అర్టిస్టిక్ డైరెక్టర్ థామస్ జాలీ ప్రారంభ కార్యక్రమాన్ని రూపుదిద్దారు. మొత్తం 85 బోట్లు 6800 మంది అథ్లెట్లను మోసుకుంటూ ముందుకు సాగాయి. ఇందులో 205 దేశాలకు చెందిన అథ్లెట్లు, సహాయక సిబ్బంది, అధికారులు ఉన్నారు. చారిత్రక క్యాథ్రడెల్ నోట్రె డేమ్ ద్వారా బోట్లు ప్రయాణించాయి. ఓవైపు వరుణుడు అంతరాయం కల్గించినా ఏ మాత్రం జోష్ తగ్గకుండా ఆటగాళ్లు చిరునవ్వుతో ముందుకు సాగారు.

**భారీ భద్రతా మధ్య:** పారిస్ ఆరంభ వేడులకు అట్టహాసంగా చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. మార్చ్‌పాస్ట్ జరిగే ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంది. మొత్తంగా 3 లక్షల మంది వీక్షించే అవకాశమున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు.



## లేడీ గాగా షో

ప్రారంభ వేడుకలు ప్రారంభమైన కొద్దిసేటికి ప్రముఖ పాప్ సింగర్ లేడీ గాగా తనదైన శైలిలో పాటలు పాడుతూ అలరించింది. వైవిధ్యమైన రీతిలో డ్రెస్ ధరించిన గాగా తన గాత్రంతో మంత్రముగ్ధులను చేసింది. ఇది ముగిసిన వెంటనే ఫ్రాన్స్ విప్లవం తదితర అంశాల సమాహారంగా కార్యక్రమాలు జరిగాయి. ముసుగు వేసుకున్న ఒక వ్యక్తి ఒలింపిక్ టార్చ్ పట్టుకుని అక్కడి బిల్డింగ్‌ల పై నుంచి దాటుకుంటూ వెళ్లడం అందరికీ ఆసక్తి కల్గించింది.

## పారిస్ ఒలింపిక్స్‌లో నేటి భారత షెడ్యూల్

| క్రీడాంశం | విభాగం | ప్లేయర్ | సమయం |
|---|---|---|---|
| బ్యాడ్మింటన్ | పురుషుల సింగిల్స్ | లక్ష్యసేన్ | రాత్రి 7.10 గంటలకు |
| బ్యాడ్మింటన్ | పురుషుల డబుల్స్ | సాత్విక్-చిరాగ్ | రాత్రి 8 గంటలకు |
| బ్యాడ్మింటన్ | మహిళల డబుల్స్ | అశ్విని-తనీషా | రాత్రి 11.50 గంటలకు |
| హాకీ | పూల్-బిలో తొలి మ్యాచ్ | భారత్ X న్యూజిలాండ్ | రాత్రి 9 గంటలకు |
| రోయింగ్ | పురుషుల సింగిల్స్ స్కల్స్ | పన్వర్ బాల్‌రాజ్ | రాత్రి 9 గంటలకు |
| టేబుల్ టెన్నిస్ | పురుషుల సింగిల్స్ ప్రిలిమినరీ | హర్మీత్ దేశాయ్ | రాత్రి 7.15 గంటలకు |
| టెన్నిస్ | పురుషుల డబుల్స్ తొలి రౌండ్ | బోపన్న,శ్రీరామ్ | మధ్యాహ్నం 3.30 గంటలకు |
| షూటింగ్ | 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ అర్హత | సందీప్ సింగ్/వలరివన్ అరుణ్/రమిత | మధ్యాహ్నం 12.30 గంటలకు |
| షూటింగ్ | 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ పురుషుల అర్హత | అర్జున్, సరబ్‌జోత్ | మధ్యాహ్నం 2 గంటలకు |
| షూటింగ్ | 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ మహిళల అర్హత | మనూ భాకర్, రిథమ్ | సాయంత్రం 4 గంటలకు |
| బాక్సింగ్ | మహిళల 54 కిలోల ప్రిలిమినరీ బౌట్ | ప్రీతి పవార్ | అర్ధరాత్రి 12.05 గంటలకు |

# ఆరంభానికి ముందు ఉగ్ర కుట్ర?

### ఫ్రాన్స్ హైస్పీడ్ రైల్వే నెట్‌వర్క్‌పై ఆకస్మిక దాడి



విశ్వక్రీడల ఆరంభోత్సవ కార్యక్రమానికి కొద్దిగంటల ముందే ఆతిథ్యదేశంలో అశాంతిని రేకెత్తించడానికి ముష్కర మూకలు భారీ ఉగ్ర కుట్ర పన్నాయా? అంటే గురువారం ఉదయం అక్కడ జరిగిన పరిణామాలు అవుననే అంటున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న హైస్పీడ్ రైల్వే వ్యవస్థపై ఆకస్మిక దాడి జరగడమే దీనికి ప్రత్యక్ష సాక్ష్యం. సొసైటీ నేషనల్ డెస్ కెమిన్స్ డి ఫర్ ఫ్రాంకైస్ (ఎస్‌ఎన్‌సీఎఫ్) హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌లోని లిల్లె, బోర్డియాక్స్, స్ట్రాస్‌బోర్గ్, పారిస్-మర్‌సెల్లి ప్రాంతాలలో గుర్తుతెలియని దుండగులు సిగ్నల్ బాక్సులను ధ్వంసం చేయడమే గాక పలు చోట్ల రైల్వే లైన్లకు నిప్పంటించి హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఈ రూట్లలో తిరిగే హై స్పీడ్ రైళ్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైల్వే నెట్‌వర్క్ సేవలు స్తంభించిపోవడంతో పలు రైళ్లు రద్దు కాగా మరికొన్నింటి రూట్లను మార్చడంతో సుమారు 8 లక్షల మంది ప్రయాణీకులపై ప్రభావం పడినట్టు తెలుస్తోంది. తాజా ఘటనతో ఒలింపిక్స్ భద్రత కోసం సుమారు 45 వేల మందితో పహారా కాస్తున్న ఫ్రాన్స్‌కు మున్ముందు మరిన్ని ఉగ్ర ముప్పులు పొంచి ఉన్నాయని నిఘా వర్గాలు తెలిపాయి.

# ఫైనల్‌కు భారత్

## సెమీస్‌లో బంగ్లాపై ఘన విజయం

### మెరిసిన రాధా, రేణుకా సింగ్ • మహిళల ఆసియా కప్


రేణుక (3/10)

దంబుల్లా: మహిళల ఆసియా కప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత క్రికెట్ జట్టు వరుసగా 9వ ఎడిషన్‌లోనూ ఫైనల్ చేరింది. గురువారం దంబుల్లా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సెమీస్‌లో ఆ జట్టును చిత్తుగా ఓడించి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. భారత బౌలర్లు రేణుకా సింగ్ ఠాకూర్ (3/10), రాధా యాదవ్ (3/14) బౌలింగ్ దెబ్బతో మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్.. 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో కెప్టెన్ నైగర్ సుల్తానా (32), శ్రోణ అక్తర్ (19 నాటౌట్) మినహా మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం స్వల్ప ఛేదనను భారత్..11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా పూర్తిచేసింది. స్మృతి మంధాన (39 బంతుల్లో 55 నాటౌట్, 9 ఫోర్లు, 1 సిక్స్), షఫాలీ వర్మ (28 బంతుల్లో 26 నాటౌట్, 2 ఫోర్లు) మరో 9 ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించారు. రేణుకాకు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది.

**రేణుకా, రాధా ధాటికి కుదేలు**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్‌ను ఆదిలోనే రేణుకా తన పేస్ పదునుతో బెంబేలెత్తించింది. మొదటి ఓవర్ నాలుగో బంతికే ఓపెనర్ దిలారా అక్తర్ (4)ను ఔట్ చేసిన ఆమె.. వరుస ఓవర్లలో ఇష్మా తంజీమ్ (8), ముర్షిదా ఖటూన్(4)ను బోల్తా కొట్టించి ఆరంభంలోనే బంగ్లాను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఆ తర్వాత స్పిన్నర్ రాధ బంగ్లాను ఆటాడుకుంది. మధ్య ఓవర్లలో దీప్తిశర్మతో కలిసి ప్రత్యర్థిని కట్టడిచేసిన ఈ యువ స్పిన్నర్.. మిడిలార్డర్‌ను దెబ్బకొట్టడంతో బంగ్లా కోలుకోలేకపోయింది.

**11 ఓవర్లలోనే ఉఫ్..**

స్వల్ప లక్ష్యాన్ని భారత్ అలవోకగా ఛేదించింది. ఆరంభం నుంచే ఓపెనర్లు బంగ్లాదేశ్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని వేగంగా పరుగులు రాబట్టారు. పాకిస్థాన్, శ్రీలంక మధ్య జరిగిన రెండో సెమీస్‌లో లంక మహిళలు 3 వికెట్ల తేడాతో గెలిచింది. భారత్, శ్రీలంక మధ్య ఆదివారం టైటిల్ పోరు జరుగనుంది.


మంధాన (55 నాటౌట్)

### సంక్షిప్త స్కోర్లు:

**బంగ్లాదేశ్:** 20 ఓవర్లలో 80/8 (సుల్తానా 32, అక్తర్ 19 నాటౌట్, రేణుక 3/10, రాధా 3/14)
**భారత్:** 11 ఓవర్లలో 83/0 (మంధాన 55 నాటౌట్, షఫాలీ 26 నాటౌట్)

# ఆ నలుగురు

నాలుగేండ్లకోమారు జరిగే ఒలింపిక్స్‌లో పతకాలు కొల్లగొట్టేందుకుని పలు దేశాల వందలాది క్రీడాకారులను తమ దేశం నుంచి పంపిస్తుంటాయి. కానీ తాజా ఒలింపిక్స్‌లో మాత్రం నాలుగు దేశాలు తమ దేశాల నుంచి ఒక్కో అథ్లెట్‌నే విశ్వక్రీడలకు పంపాయి. ఆ నాలుగు దేశాలు బెలిజ్, నవురు, సోమాలియా, లీచ్టెన్‌స్టెయిన్. ఈ నాలుగు దేశాల జనాభా సుమారు 20 మిలియన్లు (2 కోట్లు) మాత్రమే. లీచ్టెన్‌స్టెయిన్ తరఫున రొమనొ పంటెనర్ (స్లైక్లిస్ట్), సొమాలియా నుంచి అలి ఇడొ హసన్ (800 మీటర్ల రన్నింగ్) బరిలోకి దిగనుండగా షాన్ గిల్ (బెలిజ్), వింజర్ కకివుయె (నవురు) వంద మీటర్ల రన్నింగ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## 58 ఏండ్ల వయసులో ఒలింపిక్స్ ఎంట్రీ

పారిస్: వయసు అనేది ఒక అంకె మాత్రమే అని మరోసారి చాటిచెబుతూ 58 ఏండ్ల వయసులో ఓ మహిళ ఒలింపిక్స్ బరిలో నిలిచింది. చిలీకి చెందిన టేబుల్ టెన్నిస్ ప్లేయర్ తనియా జెంగ్.. లేటు వయసులో ఈ క్రీడల్లో ఎంట్రీ ఇవ్వనుంది. చైనాలో పుట్టి టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె.. 1989లో దేశాన్ని వీడి దక్షిణ అమెరికా దేశమైన చిలీలో ఈ క్రీడను నేర్పించేందుకు వెళ్లింది. ఆట నుంచి చాలాకాలం క్రితమే వైదొలిగిన ఆమె.. కుటుంబ సభ్యుల అండతో మళ్లీ అంతర్జాతీయ స్థాయిలో రీఎంట్రీ ఇచ్చింది. గతేడాది పాన్ అమెరికన్ గేమ్స్‌లో కాంస్యం నెగ్గిన జెంగ్.. ఒలింపిక్స్‌లో పాల్గొనాలన్న తన చిరకాల కోరికను పారిస్‌తో నెరవేర్చుకుంటోంది.

# భారత్, లంక యువ సవాల్

### కొత్త కోచ్, కెప్టెన్ హయాంలో తొలి పరీక్ష • నేటి నుంచే భారత్, శ్రీలంక టీ20 సిరీస్




పల్లెకెలె (శ్రీలంక): సుదీర్ఘ నిరీక్షణ అనంతరం భారత్‌కు ఐసీసీ ట్రోఫీ అందించిన రోహిత్ శర్మ వారసుడిగా అనూహ్యంగా తెరపైకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్, రాహుల్ ద్రవిడ్ నుంచి హెడ్‌కోచ్ పగ్గాలు అందుకున్న గౌతం గంభీర్‌కు కెప్టెన్-కోచ్‌గా శ్రీలంక సిరీస్‌తో మొదటి పరీక్ష ఎదురుకానుంది. ‘టార్గెట్-2026 టీ20 వరల్డ్ కప్’ దిశగా భారత క్రికెట్ జట్టు తొలి అడుగు వేయనున్నది. మరోవైపు రోహిత్, కోహ్లీ, జడేజా వంటి దిగ్గజాలు ఈ ఫార్మాట్‌లో తప్పుకోవడంతో లంకతో జరుగబోయే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో సత్తా చాటి వారి స్థానాలను భర్తీ చేయడంతో పాటు జట్టులో చోటు సుస్థిరం చేసుకునేందుకు కొత్తతరం కుర్రాళ్లు సిద్ధమవుతున్నారు. పల్లెకెలె స్టేడియం వేదికగా శనివారం నుంచి మొదలుకాబోయే టీ20 సిరీస్‌లో ఈనెల 28, 30న మిగిలిన మ్యాచ్‌లు జరుగుతాయి.

**గంభీర్-సూర్య శకం**

రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడైన గంభీర్ మార్గనిర్దేశకత్వంలో సూర్య అండ్ కో. పై ఒక అవగాహనకు వచ్చేందుకు గౌతీకి ఇది మంచి అవకాశం. హెడ్‌కోచ్‌గా అనుభవం లేకపోయినా గతంలో ఐపీఎల్ ఫ్రాంచైజీలు లక్నో, కోల్‌కతాకు మెంటార్‌గా వ్యవహరించిన అతడు.. జట్టుపై తన మార్కు ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాడు. రోహిత్, కోహ్లీ స్థానాలను భర్తీ చేసేందుకు గిల్, జైస్వాల్ వంటి కుర్రాళ్లకు ఇదే సువర్ణావకాశం. జడ్డూ స్థానాన్ని అక్షర్ పటేల్‌తో పూరించాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. హార్దిక్ పాండ్యాను కాదని రోహిత్ వారసుడిగా రేసులోకి వచ్చిన ‘మిస్టర్ 360’ ఆ బాధ్యతలను ఎలా నిర్వర్తిస్తాడనేది ఆసక్తికరం. సారథ్యం కోల్పోయినా జట్టుతో చేరిన పాండ్యా.. సూర్యతో ఎలా సమన్వయం చేసుకుంటాడో చూడాలి. బుమ్రా గైర్హాజరీ నేపథ్యంలో అర్ష్‌దీప్, సిరాజ్ పేస్ బాధ్యతలు మోయనున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.